మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదు

సీఎం ప్రతిపాదన లేకుండా తొలగించలేరు

తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 6: మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన తమిళనాడు మంత్రి వీ సెంథిల్‌బాలాజీని క్యాబినెట్ నుంచి తొలగించేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ముఖ్యమంత్రి ప్రతిపాదన లేకుండా ఓ మంత్రిని గవర్నర్ తొలగించడం సాధ్యం కాదని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం మౌఖికంగా తేల్చి చెప్పింది. డీఎంకే మంత్రిని క్యాబినెట్ నుంచి తొలగించాలన్న పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో దానిలో తాము జోక్యం చేసుకోబోమని న్యాయస్థానం స్పష్టం చేసింది. క్యాబినెట్‌లో మంత్రి బాలాజీ కొనసాగాలా? వద్దా? అనేది ముఖ్యమంత్రి నిర్ణయానికి మద్రాస్ హైకోర్టు వదిలివేయడాన్ని న్యాయవాది ఎంఎల్ రవి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అత్యున్నత న్యాయస్థానం తాజాగా ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. 2011-15 మధ్య అన్నాడీఎంకే ప్రభుత్వంలో రవాణా మంత్రిగా పనిచేసిన సెంథిల్‌బాలాజీ 'క్యాష్ ఫర్ జాబ్స్' కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2021 డీఎంకేలో చేరిన ఆయనను ఈడీ గతేడాది అరెస్ట్ చేసింది.

పోలీసుపై చేయి చేసుకొన్న బీజేపీ ఎమ్మెల్యే

- **పుణెలో కేసు నమోదు**

పుణె, జనవరి 6: మహారాష్ట్రకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కాంబ్లే డ్యూటీలో ఉన్న ఓ పోలీస్‌పై చేయి చేసుకొన్నారు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసినట్టు పుణె పోలీసులు శనివారం వెల్లడించారు. స్థానిక దవాఖానలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. పుణె కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న సునీల్ కాంబ్లే స్థానిక సస్సూన్ జనరల్ హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కూడా ఈ ప్రోగ్రామ్‌కు హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం మెట్లపై నుంచి దిగుతూ వస్తున్న కాంబ్లే.. అక్కడ డ్యూటీలో ఉన్న ఓ పోలీసు కానిస్టేబుల్‌పై చేయి చేసుకోవడం వీడియోలో కనిపించింది. అయితే పోలీసు అధికారిపై చేయి చేసుకొంటున్నట్టు వస్తున్న ఆరోపణలు ఎమ్మెల్యే కాంబ్లే ఖండించారు. తాను ఎవరిపై దాడి చేయలేదని, మెట్లపై నుంచి దిగుతున్న క్రమంలో అడ్డొచ్చిన వ్యక్తిని తోయడం మాత్రమే జరిగిందని చెప్పుకొచ్చారు.

'జమిలి'పై సలహాలివ్వండి

ప్రజలకు కోవింద్ కమిటీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 6: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' కమిటీకి నేతృత్వం వహిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దానిపై ప్రజలు సలహాలు, సూచనలు పంపాలంటూ విజ్ఞప్తి చేశారు. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు ప్రస్తుతమున్న చట్టపరమైన పరిపాలనా రూపాన్ని తగిన విధంగా ఎలా మార్పు చేయాలో తగిన సలహాలు, సూచనలు పంపాలంటూ ప్రకటనలో కోరారు. వీటిని రాతపూర్వకంగా తమ వెబ్‌సైట్ onoe.gov.in లేదా ఈ-మెయిల్ sc-hlc@gov.inకు ఈ నెల 15లోగా పంపాలని కోరారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఏర్పాటైన ఈ కమిటీ ఇప్పటికే రెండు సార్లు సమావేశాలు నిర్వహించింది. దేశంలోని ఆరు జాతీయ, 33 ప్రాంతీయ పార్టీలతో పాటు గుర్తింపు పొందని పార్టీలకు లేఖ రాసి జమిలి ఎన్నికలపై తమ అభిప్రాయాన్ని కోరింది.



ఆదిత్య విజయం!

హ్యాలో ఆర్బిట్‌లోకి ఆదిత్య ఎల్ 1 శాటిలైట్

- **సూర్యుడి బాహ్య వాతావరణం, సౌర జ్వాలలపై అధ్యయనం**
- **ఇస్రో సైంటిస్టులపై ప్రశంసలు కురిపించిన రాష్ట్రపతి, ప్రధాని**

న్యూఢిల్లీ, జనవరి 6: సూర్యుడిపైకి ఇస్రో ప్రయోగించిన 'ఆదిత్యాస్త్ర' విజయవంతమైంది! సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి పంపిన ఆదిత్య ఎల్1 అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. శాటిలైట్‌ను తుది కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు శనివారం చేపట్టిన కీలక విన్యాసం విజయవంతమైంది. గత ఏడాది సెప్టెంబర్ 2న సూర్యుడి దిశగా మొదలైన ఆదిత్య ప్రయాణం, దాదాపు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో వున్న లగ్రాంజ్ పాయింట్‌ను చేరుకుంది. 126 రోజుల తర్వాత హ్యాలో కక్ష్యలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి అత్యంత కీలకమైన సమాచారం భూమిపైన ఇస్రో కేంద్రానికి ఆదిత్య ఎల్1 పంపనున్నది. సూర్యుడి బాహ్య వాతావరణాన్ని లోతుగా అధ్యయనం చేసేందుకు ఇస్రో చేపట్టిన మొదటి ప్రయోగం ఇది. ఆదిత్య ఎల్1 అనుకున్న లక్ష్యాన్ని చేరుకుందని తొలుత ప్రధాని మోదీ ఎక్స్‌లో ప్రకటించారు. ప్రయోగం విజయవంతం చేసిన శాస్త్రవేత్తలను ప్రధాని అభినందించారు. ఇస్రో మిషన్లలో మహిళా సైంటిస్టులు గణనీయమైన ప్రాతపోషిస్తున్నారని రాష్ట్రపతి కొనియాడారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి జితేంద్ర సింగ్ ఆదిత్య ఎల్1 తుది కక్ష్యలో చేరింది' అంటూ ప్రశంసించారు. ఇస్రో చైర్మెన్ ఎస్ సోమ్‌నాథ్ మాట్లాడుతూ, 'ఆదిత్య ఎల్1 నిరంతరం సూర్యుడిపై ఓ కన్నేసి ఉంచుతుంది. దీనివల్ల సౌర తుఫానుల ప్రభావం ముందుగా పసిగట్టి శాటిలైట్స్, భూమిపై విద్యుత్, సమాచార వ్యవస్థలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టవచ్చు' అని అన్నారు.



శాటిలైట్ ఏం చేస్తుంది?

ఈ శాటిలైట్‌లో ఏడు పేలోడ్లు ఉన్నాయి. ఇందులోని పలు డిటెక్టర్లు..సూర్యుడి బాహ్య వాతావరణం (సోలార్ కరోనా), ఫొటో స్పియర్, క్రోమో స్పియర్‌ను అధ్యయనం చేస్తాయి. సౌర వాతావరణం, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్‌పై ఆదిత్య ఎల్1 కీలక సమాచారం పంపనున్నది.

హ్యాలో ఆర్బిట్‌లోకి..

భూమి-సూర్యుడి వ్యవస్థలో ఐదు లగ్రాంజ్ పాయింట్స్ వుంటాయి. మిగతా గ్రహాలు, ఉపగ్రహాలకు..సూర్యుడికి మధ్య కూడా ఇవి ఉంటాయి. దీనిని 'హ్యాలో ఆర్బిట్' అంటారు. భూమి నుంచి దాదాపు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంది. లగ్రాంజ్ వద్దకు చేరుకోవడానికి ఆదిత్య ఎల్1కు నాలుగు నెలల సమయం పట్టింది. అమెరికా, యూరప్, చైనా, జపాన్ తర్వాత ఈ ఘనత సాధించిన దేశంగా భారత్ నిలబడింది.

ఏమిటీ ఎల్1 పాయింట్?

అంతరిక్షంలో సూర్యుడు, భూమి మధ్య ఉండే బలాలు దాదాపు 'జీరో' అయిన స్థానాన్నే 'లగ్రాంజ్' పాయింట్‌గా పేర్కొంటారు. ఈ పాయింట్ చుట్టూ ఉండే 'హ్యాలో ఆర్బిట్'లో ప్రవేశించిన శాటిలైట్ సూర్యుడ్ని నిరంతరం పరిశీలిస్తుంది. సూర్యుడి నుంచి వెలువడే అత్యంత శక్తివంతమైన కాంతి కణాలను, అంతరిక్షంలో వాటి ప్రభావం, శాటిలైట్స్ పనితీరు మొదలైనవి తెలుసుకోవాలన్నది సైంటిస్టుల ఉద్దేశం.

మహిళా సైంటిస్టు నేతృత్వంలో..

బెంగళూరు, జనవరి 6: భారత్ చేపట్టిన మొట్టమొదటి సోలార్ మిషన్ 'ఆదిత్య ఎల్1' ప్రాజెక్ట్‌కు మహిళా శాస్త్రవేత్త నిగర్ సాజీ నేతృత్వం వహించారు. ఈ మిషన్ సక్సెస్ కోసం ఆమె సారథ్యంలోని సైంటిస్టుల బృందం 9 ఏండ్ల పాటు అహర్నిశలు పని చేసింది. మిషన్ సక్సెస్ అయిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'మహిళా సైంటిస్టులకు ఇస్రోలో ఎలాంటి అడ్డంకులూ లేవు. టాలెంట్‌కు మాత్రమే ఇక్కడ ప్రాధాన్యత ఉంటుంది. ఆదిత్య ఎల్1 అత్యంత కష్టతరమై, సవాల్‌తో కూడుకున్న ప్రాజెక్ట్' అని అన్నారు. తమిళనాడు టెంకాశి జిల్లాకు చెందిన నిగర్ సాజీ ప్రఖ్యాత సైంటిస్టు మేరీ క్యూరీని స్ఫూర్తిగా తీసుకొని ఇస్రోలో చేరారు.

బ్రిజ్‌పై అభియోగాలు నమోదు చేయండి

- **కోర్టును కోరిన ఢిల్లీ పోలీసులు**

న్యూఢిల్లీ, జనవరి 6: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులు శనివారం స్థానిక కోర్టును కోరారు. బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు మోపడంపై పోలీసుల వాదనలు ముగిశాయి. ఆరోపించిన ఘటనల్లో కొన్ని విదేశాల్లో జరిగినందున.. అవి ఢిల్లీలోని కోర్టుల పరిధిలోకి రావన్న నిందితుల వాదనను పోలీసులు తిరస్కరించారు. బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపిస్తున్న ఘటనలు ఢిల్లీ, దేశంలో లేదా విదేశాల్లో ఎక్కడ జరిగినా, అవి ఒకే నేరానికి సంబంధించినవని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు పేర్కొన్నారు. ఈ కేసుపై విచారణ జరిపేందుకు ఢిల్లీ కోర్టుకు అధికార పరిధి ఉన్నదని పేర్కొన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణను కోర్టు జనవరి 20కి వాయిదా వేసింది.

రేషన్ స్కామ్‌లో మరో టీఎంసీ నేత అరెస్ట్

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో రేషన్ కుంభకోణం కేసులో మరో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లా, బొంగావ్ పురపాలక సంఘం మాజీ చైర్మన్ శంకర్ ఆఢ్యను శనివారం ఉదయం ఆయన నివాసంలో అరెస్ట్ చేసి, కోల్‌కతాలోని ఈడీ కార్యాలయానికి తరలించారు. శనివారం ఆయనను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యుల ఇండ్లలో 17 గంటలపాటు సోదాలు నిర్వహించి, రూ.8 లక్షలు నగదు, పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఆయనను అరెస్ట్ చేసి, తీసుకెళ్తుండగా, ఆయన మద్దతుదారులు ఈడీ అధికారులపై రాళ్లు రువ్వి, వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది లాఠీఛార్జి చేశారు. ఈ సందర్భంగా ఆద్య మీడియాతో మాట్లాడుతూ, తాను దర్యాప్తునకు సహకరిస్తానని చెప్పారు.

జార్ఖండ్ సీఎం సలహాదారుకు ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి 6: అక్రమ మైనింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మీడియా సలహాదారుడు, సభిగంజ్ డిప్యూటీ కమిషనర్లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. రూ.1000 కోట్ల అక్రమ మైనింగ్ కేసులో మనీ లాండరింగ్‌కు పాల్పడిన సీఎం సలహాదారు అభిషేక్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రామ్ నివాస్ యాదవ్ ఈ నెల 16, 11 తేదీల్లో తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. అలాగే బినోద్ సింగ్ అనే వ్యక్తికి 15న రావాలంటూ నోటీసు ఇచ్చింది. కాగా, ఇదే కేసుకు సంబంధించి సాహిబ్‌గంజ్ డీఎస్పీ రాజేంద్ర దూబే, మరికొందరి ఇండ్లపై ఈడీ ఈ నెల 3న దాడులు నిర్వహించింది.

కనీస మద్దతు ధర చట్టం కోసం డిమాండ్

బర్నాల (పంజాబ్), జనవరి 6: రైతుల పంటలకు కనీస మద్దతు ధర హామీని కల్పించే చట్టాన్ని రూపొందించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, 18 రైతు సంఘాల ఆధ్వర్యంలో శనివారం పంజాబ్‌లోని బర్నాలలో నిర్వహించిన మహాపంచాయత్ డిమాండ్ చేసింది. ఫిబ్రవరి 13న 'ఢిల్లీ ఛలో' కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. అంతేకాకుండా యూపీలోని లఖింపురీ హింసలో బాధిత రైతులకు న్యాయం చేయాలని భారతీయ కిసాన్ యూనియన్ చీఫ్ జగ్జిత్ సింగ్ దాలేవాల్ అన్నారు. రైతు చట్టాల ఎత్తివేత డిమాండ్ ఆందోళనలో అసువులు బాసిన రైతులకు సంస్మరణగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

భూకంపంతో జపాన్‌లో కొత్త బీచ్‌లు

టోక్యో : జపాన్‌లో గత సోమవారం ఏర్పడిన భారీ భూకంపం నోటో ద్వీపకల్పంలో కొత్త బీచ్‌లను ఏర్పాటు చేసింది. భూకంపం తీరం వెంబడి భూమిని పెంచింది. కొన్ని ప్రదేశాలలో తీర ప్రాంతాన్ని 820 అడుగుల వరకు విస్తరించింది. దీంతో కొత్త బీచ్‌లు ఏర్పడ్డాయి. కొన్ని చోట్లయితే ఏకంగా 250 మీటర్లకు పైగా పైకి వచ్చినట్టు యూనివర్సిటీ ఆఫ్ టోక్యో వెల్లడించింది. సాంకేతికంగా అప్‌లిఫ్ట్‌గా వ్యవహరించే ఈ చర్య కారణంగా తీరం వెంబడి సుమారు 13 మీటర్ల వరకు భూమి పైకి లేచింది. ఇందుకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలను అధికారులు విడుదల చేశారు.

అయోధ్య ఆలయానికి 11 కోట్ల విరాళం

ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన అందజేత

ముంబై, జనవరి 6: అయోధ్యలో రామమందిర నిర్మాణానికి మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన రూ.11 కోట్లు విరాళం ప్రకటించింది. శివసేన పార్టీ నాయకులు శనివారం శ్రీరామ్‌మందిర్ తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను కలుసుకొని విరాళం చెక్‌ను అందజేశారు. శ్రీరాముడి విగ్రహం కోసం బంగారు పాదుకల్ని తయారుచేయించిన హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి, తన పాదయాత్రలో అయోధ్యకు 272 కిలోమీటర్ల దూరంలోని చిత్రకూట్‌కు చేరుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు కార్తిక్ జోషి ఇండోర్ నుంచి అయోధ్యకు 1008 కిలోమీటర్లు మారథాన్ రన్‌ను చేపట్టారు. శుక్రవారం మొదలైన ఆయన మారథాన్ పరుగు 14 రోజుల తర్వాత అయోధ్యను చేరుకోనున్నది. నేపాల్‌లోని జనక్‌పురికి చెందిన భక్తులు సందేశ యాత్రలో వివిధ కానుకలను తెచ్చి అయోధ్య రామాలయానికి సమర్పించారు.

శబరిమల ప్రసాదంపై పరిమితి

పథనంతిట్ట: శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో అరవణ ప్రసాదం కొరత ఏర్పడటంతో ఒక భక్తుడికి రెండు డబ్బాలు మాత్రమే ఇవ్వాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డ్ పరిమితి విధించింది. దీంతో పొరుగు రాష్ట్రాల భక్తులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అరవణ ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఉపయోగించే డబ్బాల కొరత ఉందని దేవస్థానం బోర్డు ప్రతినిధులు తెలిపారు. డబ్బాల కోసం మరో రెండు కంపెనీలకు ఆర్డర్ ఇచ్చామని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

బంగ్లాదేశ్‌లో పోలింగ్ కేంద్రాలకు నిప్పు

ఢాకా : బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలను తటస్థ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలనే డిమాండ్‌తో ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ఢాకాలో ఐదు ప్రాథమిక పాఠశాలలను తగులబెట్టారు. వీటిలో నాలుగు పోలింగ్ బూత్‌లు కూడా ఉన్నాయి.

విమాన ద్వారం ఊడిపోయిన చోట ఖాళీగా కనిపిస్తున్న దృశ్యం

ఆకాశంలో ఊడి.. గుండెలదిరేలా చేసి..

- **టేకాఫ్ తర్వాత ఊడిన విమాన ద్వారం**
- **అత్యవసర ల్యాండింగ్ చేసిన పైలట్లు**

న్యూఢిల్లీ, జనవరి 6: అమెరికాలో అలస్కా ఎయిర్‌లైన్స్ బోయింగ్ విమాన ప్రయాణికులు శనివారం అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణించాల్సి వచ్చింది! పోర్ట్‌ల్యాండ్ నుంచి ఒంటారియోకు వెళ్లాల్సిన బోయింగ్ 737-9 మ్యాక్స్ విమానం టేకాఫ్ అయిన కొంతసేపటికి 16,325 అడుగుల ఎత్తులో దాని మధ్య క్యాబిన్ నిష్క్రమణ ద్వారం ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఫ్లైట్‌ను పోర్ట్‌ల్యాండ్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో 171 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అలస్కా ఎయిర్‌లైన్స్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నది. యూఎస్ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు(ఎన్‌టీఎస్‌బీ) కూడా దర్యాప్తు ప్రారంభించింది. ఊడిన డోర్ పక్కనే ప్రయాణికుల సీట్లు ఉన్నాయి. ఈ ప్రమాదంలో కొంత మంది ఫోన్లు కూడా బయటకు ఎగిరి పడినట్టు తెలుస్తున్నది.

ఒకే రోజు 774 కొవిడ్ కేసులు



న్యూఢిల్లీ, జనవరి 6: దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. శనివారం రికార్డు స్థాయిలో 774 కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 4,187కు చేరుకుంది. తమిళనాడు, గుజరాత్‌లలో ఒక్కో మరణం నమోదైనట్టు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం వెల్లడించింది. రోజువారీ కొవిడ్ కేసుల సంఖ్య డిసెంబర్ 5 వరకు రెండంకెల్లో మాత్రమే నమోదయ్యేవి. అయితే శీతాకాలం కారణంగా వాతావరణంలో చల్లదనం పెరగడం, కొత్త కొవిడ్ వేరియంట్ జేఎన్.1 కారణంగా రోజువారీ కేసుల సంఖ్య మూడంకెలకు చేరుకుంది. డిసెంబర్ 31న రికార్డు స్థాయిలో ఒకే రోజు 841 కేసులు నమోదయ్యాయి.

అగ్ని పర్వతంలో విద్యుత్తు పుట్టిస్తారు

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): అగ్ని పర్వతంలోని లావాతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తామని క్వాయిన్ ఎనర్జీ అనే అమెరికన్ స్టార్టప్ కంపెనీ చెప్తున్నది. అగ్ని పర్వతం శిలాద్రవం గదిలోకి రంధ్రం చేసి, భూ ఉపరితలంపై ఏర్పాటు చేసిన టర్బైన్‌ల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని చెప్తున్నది. వాతావరణ కాలుష్యం కలిగించని ఈ క్రాప్లా మాగ్మా టెస్టబెడ్ (కెబీటీ) ప్రాజెక్టును 2026లో ప్రారంభించనున్నట్లు తెలిపింది.



హాస్టల్ నుంచి 26 మంది బాలికలు అదృశ్యం

12 మందిని గుర్తించిన అధికారులు

భోపాల్, జనవరి 6: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక వసతి గృహం నుంచి 26 మంది బాలికలు అదృశ్యమయ్యారు. వీరంతా గుజరాత్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు. అయితే అదృశ్యమైన వారిలో 12 మందిని పోలీసులు పట్టుకున్నారు. బాలికల అదృశ్యానికి బాధ్యులను చేస్తూ ఇద్దరు శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులను సస్పెండ్ చేయగా, ఇద్దరికి నోటీసులు జారీ చేశారు. అంతకుముందు భోపాల్ శివారు పర్వాలియా ప్రాంతంలోని ఆంచల్ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) చైర్మన్ ప్రియాంక్ కనుంగో ఆకస్మిక తనిఖీ సందర్భంగా బాలికల అదృశ్యం వెలుగు చూసింది. తనిఖీలో 68 మంది బాలికల్లో 26 మంది అక్కడ లేనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆశ్రమాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించడమే కాక అందులో అనేక అక్రమాలు జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. తప్పిపోయిన బాలికలు 6 నుంచి 18 సంవత్సరాల లోపు వారని, వీరిలో కొందరు వీధుల్లో అనాథలుగా ఉన్నవారని, వారు వివిధ మతాలకు చెందిన వారైనా అందరికీ క్రైస్తవాన్ని నూరిపోస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళ పురుష గార్డులు విధులు నిర్వహిస్తున్నారని ప్రియాంక కనుగో ట్వీట్ చేశారు.



ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఉన్న తాజ్‌మహాల్ వద్ద శనివారం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో తాజ్‌మహల్‌లోని దాదాపు సగ భాగం కనిపించలేదు.

చలి గుప్పిట ఉత్తరాది

కశ్మీర్‌లో గడ్డ కట్టిన దాల్ సరస్సు

శ్రీనగర్, జనవరి 6: జమ్ము కశ్మీర్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో చలి వణికిస్తున్నది. కశ్మీర్‌లో ఎముకలు కొరికే విధంగా చలి గాలులు వీస్తున్నాయి. చలి తీవ్రతతో దాల్ సరస్సు ఉపరితలం పైపొరపై సన్నని మంచు పలక ఏర్పడింది. కశ్మీర్ లోయలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 4 డిగ్రీల కంటే తక్కువగా నమోదైందని అధికారులు శనివారం వెల్లడించారు. శ్రీనగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి మైనస్ 5.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయిందని తెలిపారు. మరోవైపు రాగల 3-4 రోజుల పాటు పలు రాష్ట్రాల్లో వర్షాలు, వడగండ్ల వానలు పడే అవకాశం ఉన్నదని ఐఎండీ అంచనా వేసింది. తమిళనాడు, కేరళ, ఏపీ దక్షిణ కోస్తా, ఢిల్లీ, ఛండీగఢ్, హిమాచల్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో 6 -10 తేదీల మధ్య వర్షాలు కురవొచ్చని తెలిపింది.

3 గంటలు ఐస్ పెట్టెలో గడిపి!

పోలండ్ వ్యక్తి గిన్నిస్ రికార్డు

న్యూఢిల్లీ, జనవరి 6: కొద్దిపాటి చలికే మనం గజగజ వణికిపోతుంటాం. చిన్న ఐస్ ముక్కను కూడా ఎక్కువ సేపు పట్టుకోలేక వదిలేస్తుంటాం. అయితే పోలండ్‌కు చెందిన వలేర్జన్ రోమనోవ్స్కీ అనే వ్యక్తి ఐస్ గడ్డలతో నింపిన ఒక పెట్టెలో ఏకంగా మూడు గంటల పాటు నిలబడి ప్రపంచ రికార్డు సాధించాడు. ఆ సమయంలో మెడ వరకు అతడి శరీరం ఐస్ లోపలే ఉన్నది. గత రికార్డులను బద్దలు కొడుతూ రోమనోవ్స్కీ చేసిన విన్యాసానికి సంబంధించిన వీడియోను గిన్నెస్ వరల్డ్ రికార్డ్స్(జీడబ్ల్యూఆర్) షేర్ చేసింది. గతంలో ఐస్ బాక్స్‌లో 2 గంటల 35 నిమిషాల పాటు నిలబడిన ఫ్రాన్స్‌కు చెందిన రొమైన్ వందెన్‌డోర్స్ పేరిట ఈ వరల్డ్ రికార్డు ఉండేది. తన రికార్డుపై రోమనోవ్స్కీ స్పందిస్తూ ఇందుకోసం గత ఆర్నెళ్లుగా శిక్షణ తీసుకొంటున్నానని, శరీరాన్ని అందుకు అనుగుణంగా మార్చుకొన్నానని పేర్కొన్నారు.